


రచన : మారేమండ వెంకటసుబ్బారావు

దసరా సెలవులకు మావూరు వెళ్ళివచ్చేసరికి మా 'రూం' ప్రాంతాల్లో చాలా మార్పులు కన్పించేయి. ముఖ్యంగా గమనించవలసింది మా 'రూం'కి ఎదురుగా పిల్లలకోడిలావుండే ఎలిమెంటరీ స్కూలుమేష్టారు వుండటంలేదు. ఆ పిల్లల అల్లర్లేలేవు. కాని ఆ అలికిడిని మించిన అలికిడి వినిపిస్తోంది. ఆ యింటి అరుగుమీద 'బిఛాణా'వేసి ఒక ప్రౌఢవిధవ ప్రాంతీయరేడియోకేంద్రంగా విలసిల్లుతూంది. ముల్లోకాలవార్తలు, పైసాకూడా ఆశించకుండా అదేపనిగా వినిపిస్తూంటుంది. వినటానికి మనకైనా వినుగుపుడ్తుందేమో కాని, వాగటానికి ఆవిడకు యీషణ్మాత్రము విసుగు, విరామం ఉండదని చెప్పొచ్చు. ఆవిడ 'బ్రాడ్‌కాస్టింగ్'కి తగినట్టుగానే శ్రోతలప్రవాహానికికూడా లోటు లేదు. హమేశా, కనీసం అర డజనుమందైనా చిన్నాపెద్దా ఆవిడదగ్గఱ వుంటూనే వున్నారు. ఇటువంటి పరిస్థితులలో, ఈ వాతావరణంలో ఉంటూన్న నేను, 'నా ఉగ్రి పరీక్ష ప్యాసవగలనా' అనే అనుమానం, నిరనుమానంగా కలిగింది. "ఆవిడ ఎవర"ని పనిమనిషిని అడిగితే—ఆ యింట్లో క్రొత్తగా దిగినవారని తనకు అంతకన్నా వాళ్లగురించి ఏమి తెలియదని చెప్పింది.

మర్నాటి ఉదయం; ఎంతో ఆలోచనచేసిన మీదట, గది మార్చటమే శ్రేయస్కర మని పించింది. నలుగురు మిత్రులతో, పరిస్థితులు వివరిస్తూ మంచిగది చూడమని చెప్పాను. వాళ్ళూ 'అభయహస్తాలు' చాచారు. రెండు రోజులు ఓపికపట్టే తలకి అమృతాంజనం మంట తప్పుతుందనే 'దిలాసా'తో 'రూం' లోనే కాలక్షేపం చేస్తున్నాను.

ఆరోజు సాయంత్రం అనుకోని సంఘటన జరిగింది. అది మరువరానిదీ. నేను 'రూం' లో కూర్చొని ప్రఖ్యాత ఫ్రెంచి కథారచయిత 'మొపాసా' కథలు మైమరచి చదువుతున్నాను. మా ఎదుటి పోర్షన్లో మామ్మగారు, తనపురాణం కట్టిపెట్టి గుళ్ళో పురాణం వినటానికి వెళ్లినట్టుంది అలికిడిగా లేదు. చీకటి అలుముకుంటోంది. లేచి లైటువేయటానికి బద్ధకంగా ఉండటంవల్ల, చదువుతూన్న పుస్తకాన్ని అయిష్టంగానే మూసి, అలా యీజీఛేర్‌లోనే కూర్చొని, సిగరెట్లు తగలేస్తూ, నా అదృష్టం కొద్దీ దొరికిన ఆ కాస్త ప్రశాంతతను అనుభవిస్తున్నాను. కాని, ఆ ఎదుటి పోర్షన్లో గాజుల గలగలలు ఆ నిశ్శబ్దాన్ని చీల్చి నా చెవులను సోకేయి. అప్రయత్నంగానే, నాదృష్టి అటు ప్రసరింపజేసాను. 'టిక్'మన్న శబ్దంతో జిగ్గుమని వెలిగింది విద్యుద్దీపం. ఆ వెలుగులో, అద్దంలో చూసుకొంటూ, పైట సర్దుకొంటూన్న యువతీమణి సాక్షాత్కరించింది. ఆ వెలుగుకి నాకళ్ళు అలవాటుపడేసరికి, ఆమె నా గదివైపు చూసింది. కాని, నేను ఆమెకి కనుపించివుండను. ఇంతవరకూ నేను చూసిన అందమైనవాళ్లలో, ఆమె కూడా జమలోకి వస్తుంది. కాని ఆమె అధరాల్లో నాకొకప్రత్యేక ఆకర్షణ కనుపించింది. ప్రవరుడు వరూధినిని తిరస్కరించేడుగాని, ఈమెనే చూసివుంటే, తనయింటిని యిల్లాలినిమరచి, ఈమె సౌందర్యారాధనలో కాలంగడిపివుండేవాడు. అయినా కాలానికి అందనికబుర్లతో కాలక్షేపం చెయ్యటమెందుకు?....నిజంచెప్పాలంటే .... "ఆమెను చూడటంతోడనే నాలో....నా హృదిలో....నా మదిలో....ఏదో అవ్యక్తమైన ఆనందం, అనురక్తి, ఆకాంక్ష కలిగేయి. నా బద్ధకమంతా ఏమైందో చెప్పలేను గాని, నాకు తెలియకుండానే 'రూం'లో లైటువేసి, మరో సిగరెట్ ముట్టించేను. ఈమాటు, నేను ఆమెకు కనిపించేవుంటాను అనుమానం దేనికి....? ఆమె నన్నే చూస్తోంది ! నా కళ్ళల్లోకి లోతుగా చూస్తోంది! నేనుకూడా 'డిటో'. కాని ఆమె ముఖకవళికలు మారినట్టు గమనించగలిగేను. వేదనా సక్తమైనభావాలతో ఆమె ముఖపద్మం ముకుళించింది. ఆమె ఏదో ఆవేశాన్ని అదిమిపట్టా నిట్టూర్చి వెనుతిరిగింది. తలుపు వేస్తూ నావేపు ఒక చూపుతూపు విసిరింది.

నేను సామాన్యమానవుణ్ణి. ప్రతి 'సరమానవుడి'లోను ఉండే ఉద్రేకాలు, కాంక్షలు, నాలోకూడా గూడుకట్టుకొనివున్నాయి. ఆమె చూపుతూపుతో నా రుధిరం గిలకొట్టింది. నరాలు నవరక్తంతో నిండేయి. కాని ఆమె రూపం తలచుకోవటంతోనే ఆరాత్రిగడచింది. హఠాత్తుగా ఆగిపోయిన మధుర స్వప్నంలాగ, జరిగిన సంఘటన మరపుకు రావటంలేదు.

మర్నాడు తెల్లవారినదగ్గర్నుండి ఆమె కనుపిస్తుందేమోనని ఆతృతగా ఎదురుచూశాను. కాని, రేడియో మామ్మగారు, శ్రోతలు తప్ప ఆమె కనుపించనేలేదు. వెంకట్రావు వచ్చి ఎక్కడో అన్ని సదుపాయాలూవున్న గది ఉందన్నాడు. కాని, నేను యిప్పట్లో మారదలచుకోలేదని చెప్పేసరికి, వాడు 'స్టన్' అయ్యాడని చెప్పక తప్పదు. నా చంచలమైన మనస్సుకి నన్ను మెత్తగా చివాట్లువేసి, రేడియో మామ్మని నాలుగుతిట్టి వాడు చక్కా

పోయాడు. వాడితిట్లన్నీ వాడితోనేవెళ్లిపోయేయి ప్రచండమారుతంతో కారుమేఘాల్లాగ. నాకు మిగిలింది—ఆ అవ్యక్త యువతియొక్క స్వరూప పునః సందర్శనమనే చల్లని వెన్నెల లాంటి ఆశ. ఆ ఆశతోనే గదిలోంచి కదల్లేదు. సాయంత్రం ఆరుఘంటలకు మామ్మగారు పురాణానికి వెళ్లటంతో మా సమావేశానికి అనుకూల వాతావరణం యేర్పడింది. నా ఆతృత ఇనుమడించింది. క్షణ క్షణ మొక యుగంగా గడుపుతూండగానే, వరప్రసాదిని లాగ ప్రత్యక్షమైంది ఆమె. ఆమె సందర్శనం కోసం ఎదురుచూశానే కాని, తీరా ఆమె కనుపించేక ఏంచెయ్యాలో తోచలేదు. మూగగా ఆమె కన్నుల్లోకి చూస్తూండిపోయాను. ఆమె కన్నులలో నా స్వప్నలోకాల వెన్నెల వెలుగులుకంటున్నాను. అలాగ ఎంతసేపువున్నానో గాని "ఏమండీ....!" అనే మృదుమధురమైన పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. "ఆమె పిలుపే అది! ఎవర్ని పిలుస్తోందో! ఏమో! నన్నయివుండదు. ఛా! నాతో ఆమెకేం పని? కొంపతీసి నేను తదేకంగా ఆమెవైపు చూసినందుకు చివాట్లు వెయ్యడానికి పిలుస్తోందేమో!' ఆమె నాకే సైగచెయ్యడంతో ఎవరెస్టు విరిగి మీదపడ్డట్టు ఫీలయ్యాను. తప్పదు! నాకు చివాట్లు తప్పవు! "ఏమైనా ధైర్యం కూడదీసుకోక తప్పలేదు. పురుషుణ్ణయి ఉండి ఒక 'అబల'పట్ల ఇంత పిరికితనంగా ఉండటం ఏం బాగాలేదు' అనుకుంటూనే ఆమెను సమీపించేను. ఆమెనన్ను లోనికి ఆహ్వానించింది. బితుకు బితుకుగానే ప్రవేశించేను. ఆమె నన్ను కుర్చీలో కూర్చోమని ప్రక్కగదిలోకివెళ్లి, ఒక వెండిప్లేటులో ముచ్చటగా మూడు మైసూరుపాకు ముక్కలతో పునః ప్రవేశించింది. నేను ఏనాడూ ఊహించని ఈ అతి విచిత్ర సంఘటనలో నాపాత్ర సామర్థ్యంతో నిర్వహించగలనా అనే అనుమానం పొడసూపింది. నా మౌనాన్ని గమనించి ఆమే మొదలుపెట్టింది. "నా ప్రవర్తన మీకు చాలా విచిత్రంగా వుంది కదూ! అవును. అలాగే వుంటుంది. కాని నాకథ వింటే మీరలా అనుకోవలసిన అవసరం వుండదు."

నేను వీధిగుమ్మంవేపు పిరికిగా చూశాను. ఆమె కనిపెట్టి...."ఫరవాలేదు ఆయన ఊరికి వెళ్లేరు. రేపు సాయంత్రానికి గాని రారు. అత్తయ్యా ఎనిమిది గంటలయ్యాకే పురాణం నుండి వస్తారు. మీరు భయపడ నవసరం లేదు" అని నాకు ధైర్యం నూరిపోసింది.

నేనొక మైసూరుపాకుముక్క కొరికాను ; ఆమెవైపు దొంగచూపులుచూస్తూ. ఆమె ఉద్వేగాన్నాపుకోలేక నాప్రక్కనిలబడి, నా ముంగురులు సర్దుతూ — "నన్ను మరచిపోయేవా సూర్యం?" అంది. నాకు వాస్తవికతమీవ నమ్మకంపోయింది. ఏదో నాటకంలోలాగ 'ఫీ'లయ్యాను. ఆ నాటకంలో నాపేరు సూర్యం కాబోలు. నాకుకూడా ఉద్రేకం ఆగలేదు. ఆమెచేతులు నా చెమటపట్టిన చేతుల్లోకి తీసుకొన్నాను. ఆమె ముఖంలోకి ఆతృతగా చూశాను. ఆమె అర్ధనిమీలితనేత్రాలు అదురుతూన్న అధరం నాకు మత్తెక్కించేయి. ఏమి చేయబోతానో నాకే తెలిసేస్థితిలోలేను. ఆమె 'ఛ[రు'న చెయ్యి విదుల్చుకొని దూరంగా తప్పుకుంది. నేను భయంగా వెర్రిచూపులు చూశాను. ఆమె జాలిగా "మీకెంతో కష్టం కలిగించాను. క్షమించండి....ఉద్రేకం ఆపుకోలేకపోయాను. ఏమైనా నే నొకరి సొత్తును నా ప్రేమికుడు సూర్యం, మీలానే వుండేవాడు. అతను తలపుకి వచ్చినప్పుడల్లా నా ప్రవర్తన ఇల్లాగే వుంటుంది—నాలో సఫలీకృతంకాని కోరికలుతిరగబడి నన్ను వెర్రిదాన్నిచేస్తాయి."

"మీరు భగ్నప్రేమికుల్లావున్నారు!" అందామని నోటిచివరికి వచ్చి గొంతుకలో కుక్కుకున్నాను. ఆమె చెక్కిళ్ళవెంట కన్నీళ్ళు జారుతున్నై .... ఆమె యింకా చెప్పుకొని పోతోంది—" .... అంతస్తుతెరుగకుండా అస్థిపరుడైన సూర్యాన్ని ప్రేమించాను. సూర్యం తండ్రి మా వివాహానికి ఒప్పుకోలేదు. పైచదువులవంకతో సూర్యాన్ని ఇంగ్లాండు పంపేశాడు. నా జీవితంలో చీకటి అలుముకొంది. ఎదిగినపిల్లని ఇంట్లో ఎన్నాళ్ళుంచుకొంటారు? ఫలితం....ఎదుటివారి మనస్సు తెలుసుకోకుండా ప్రవర్తించే భర్త, నిరంకుశురాలైన అత్తగార్లమధ్య నలగవలసివస్తోంది. వీరిద్దర్నీ మించి — తలంపుకి వచ్చినప్పుడల్లా హృదయాన్ని కొరుక్కుతినే గడచిన అనుభవాలు! ఇంకెన్నాళ్ళు ఈ బాధ అనుభవించాలో?"

"వ్యధచెందకండి....గతాన్ని మరచి భవిష్యత్తును ప్రకాశవంతంగా ఊహించుకోండి" అని ధైర్యం చెప్పబోయాను.

"మీరు పొరబడుతున్నారు. మనదేశంలో ఆడదాని భవిష్యత్తంతా ఆమె వివాహంమీదనే ఆధారపడివుంటుంది. ఏనాడైతే ఆమెకు ఇష్టం లేని వివాహం జరిగిందో ఆనాడే ఆమె మనస్సు వికలం అయిపోతుంది........"

గడియారం ఠంగ్....ఠంగ్....మంటూ ఎనిమిదికొట్టింది.

"అత్తగారు వచ్చేవేళైంది. ఇక మీరు వెళ్లండి....నా కన్నీటిగాథ అంతులేనిది. ఇప్పటికే నా వేదనలు వ్యక్తపరచి మీకు వ్యథ కలిగించేను. ఈ నిర్భాగ్యసోదరిని మరువటానికే ప్రయత్నించండి........"

నాకాళ్లు నన్ను అప్రయత్నంగా నా గదిలోకి తీసుకొచ్చాయి. ఆమె ఆఖరున అన్న మాటలు నా చెవుల్లో పదేపదే గింగుర్లెత్తుతున్నాయి — "ఈ నిర్భాగ్యసోదరిని మరువటానికే ప్రయత్నించండి...."

ఆరాత్రి నిద్రపట్టలేదు. ఆమెగురించే ఆలోచిస్తూ కూర్చున్నాను. అంత అందమైన ఆమెకి కూడా ఇంత కష్టమా! ఛా! ఇదేం ఆలోచన? అందం ఉన్నంతమాత్రాన కష్టాలుండవా? ఆమె ఒక గులాబీపువ్వు....!

గులాబీపువ్వు అందంగా వుంటుంది. కాని చుట్టూ ముళ్ళూ "ఎటువాలినా చీల్చేసేలా వుంటాయి. ఆమెభర్త, అత్తగారు....గులాబీని ముళ్లలాగ ఆమెను కాసుకొనివున్నారు. పువ్వులోవుండే కొరుకుడు పురుగులాగ గడచిన గాథలు ఆమె హృదయాన్ని కలచివేస్తుంటాయి. ఇటువంటి జీవితం దుర్భరంకదా!

ఆమె జాలిగాథ తల్చుకొని రెండు వేడి కన్నీటిచుక్కలు రాల్చటంతప్ప నేను చేయగలిగిందేముంది ?

మర్నాడు వెంకట్రావును కల్సుకొని వాడు చెప్పిన 'రూం' ఎక్కడుందో చూపమన్నాను. వాడు నా ప్రవర్తనలోని పరివర్తనలు అర్థం చేసుకోడానికి వ్యర్థప్రయత్నంచేశాడు.

★